క్లుప్తంగా

నేటి నుంచి వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకూ వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సోమవారం 41, 42, 43, 44, 45, 46, 47, 48, 49 డివిజన్లలో, మంగళవారం 9, 10, 11, 12, 13, 14, 15 డివిజన్లలో, 29న 21, 22, 23, 24, 25, 30, 32, 33 డివిజన్లలో, 31న 34, 35, 36, 37, 38, 39, 40లో, ఒకటిన 1, 2, 3, 4, 5, 6, 7, 8, 31, 50లో జరుగుతాయన్నారు.

పాండురంగస్వామికి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి వనిత

సీటీఆర్ఐ: జాంపేట మార్కెట్లోని రుక్మిణీ సమేత పాండురంగస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో హోంమంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. ఆదివారం విగ్రహాలను వైభవంగా, శాస్త్రోక్తంగా పునఃప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఆలయాన్ని దర్శించుకుని, గుడి విశేషాలను అడిగి తెలుసుకున్నారు.

శ్యామలాంబకు పూజలు



శ్యామలాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాజా

సీటీఆర్ఐ: స్థానిక కోటిలింగాలపేటలోని శ్యామలాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పూజలు నిర్వహించారు. అనంతరం రాజేంద్ర నగర్లో కొలువైన గజ్జాలమ్మ జాతర మహోత్సవంలో పాల్గొన్నారు.

వైభవంగా జాతర



ఆకట్టుకున్న గరగ నృత్యాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక టి.నగర్ కొత్త బ్రిడ్జి సమీపంలోని శ్యామలాంబ జాతర మహోత్సవాలు ఆదివారం గుడి నిర్మాణకర్త, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన అప్పారావు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి. గరగనృత్యాలు, డప్పువాయిద్యాలతో జాతరను ఘనంగా నిర్వహించారు.

రక్తదాన శిబిరం



రక్తదాతను అభినందిస్తున్న అనుశ్రీ సత్యనారాయణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీనటుడు రామ్‌చరణ్ జన్మదిన వేడుకలలో భాగంగా ఆదివారం రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో రాజమండ్రి సంజీవిని బ్లడ్‌బ్యాంక్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన అర్బన్ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ పాల్గొని రక్తదాతలను అభినందించారు.

పాత దుస్తుల సేకరణ



సేకరించిన పాత దుస్తులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలు తమ పాత దుస్తులను అందిస్తే, వాటిని శుభ్రపరచి అవసరమైన పేదలకు పంచిపెడతామని జేసీఐ రాజమహేంద్రవరం గోదావరి నిర్వాహకుడు చరణ్ సంజీవ్ అన్నారు. ఆదివారం పుష్కరఘాట్‌లో క్లాతింగ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టన్ను బరువైన పాత దుస్తులను సేకరించారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ సేకరించిన దుస్తులను సరిచేసి, వాటిని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉంటున్న నిరుపేదలకు అందజేస్తామన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, బ్యాంక్ చైర్ పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి

లాభాల బాటలో ఆర్యాపురం బ్యాంకు

- ఎంపీ భరత్‌రామ్
- వాటర్‌ప్లాంట్ ప్రారంభం

రాజమహేంద్రవరంసిటీ: నగరంలోని ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు ఎంతో చరిత్ర ఉందని, దానిని మరింత సమర్థంగా ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకవర్గంపై ఉందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ నమ్మకమే ప్రగతికి మెట్లు అనే విషయాన్ని పాలకవర్గం, ఉద్యోగులు మరిచిపోకూడదన్నారు. ఈ బ్యాంకు 16 బ్రాంచ్‌లతో 90 వేల మంది సభ్యులతో ఎంతో పటిష్టంగా ఉందన్నారు. గత సంవత్సరం బ్యాంకు ప్రాఫిట్ రూ.23 కోట్లయితే, 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.27 కోట్లు లాభాలు గడించిందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు పాలకవర్గ చైర్‌పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి, సభ్యులు మజ్జి నూకరత్నం, మార్గాని సురేష్, సక్కెళ్ల బాబూరావు, పెంకే సురేష్ కుమార్, పతివాడ రమేష్ బాబు, రాయుడు గణేష్, వేణుం వెంకటేశ్వరరావు, గొల్లపాటి లీలా గంగాధరరావు, వెంట్రపాటి సురేష్, యర్రా ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్ పాల్గొన్నారు.

అద్భుతంగా.. శరవేగంగా..

- కంబాలచెరువు సెంటర్‌లో అభివృద్ధి పనులు
- దండి సత్యాగ్రహం స్ఫూర్తితో విగ్రహాల ఏర్పాటు



కంబాల చెరువు జంక్షన్‌లో ఏర్పాటు చేస్తున్న విగ్రహాలు

రాజమహేంద్రవరం సిటీ: దండి సత్యాగ్రహం స్ఫూర్తితో కంబాలచెరువు సెంటర్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. నగరపాలకసంస్థ నిధులు రూ.1.5 కోట్లతో నగరంలోని ప్రధానమైన కంబాల చెరువు జంక్షన్ అత్యాధునికంగా ముస్తాబవుతోంది. ఏజెన్సీ ముఖద్వారంగా సుపరిచితమైన ఈ కూడలి మీదుగా నిత్యం వేల వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. నగరాన్ని సుందర నందన వనంగా తీర్చిదిద్దుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రతిష్టాత్మకంగా ఈ విగ్రహాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

గాంధీజీ స్ఫూర్తి..

మహాత్మాగాంధీజీకి రాజమహేంద్రవరంతో అవినాభావ సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో దండి సత్యాగ్రహ స్ఫూర్తి ప్రజలకు గుర్తు ఉండే విధంగా ఈ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు, ఎంపీ ప్రకటించారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో గాంధీజీ నగరానికి ఐదుసార్లు వచ్చిన సందర్భంగా ప్రజలకు జ్ఞప్తికి వచ్చేలా దండి సత్యాగ్రహం చిహ్నంగా వీటిని సిద్ధం చేస్తున్నారు.

సుందరంగా..

గతంలో సర్పంగాంధీ జంక్షన్‌గా పేరు పొందిన ఈ సెంటర్.. తర్వాత కాలంలో వివేకానందుని విగ్రహం ఏర్పాటుతో వివేకానంద సెంటర్‌గా పేరువచ్చింది. నగరాభివృద్ధిలో భాగంగా ఈ జంక్షన్‌ను అద్భుతంగా సిద్ధం చేస్తున్నారు. దేవీచౌక్ జంక్షన్ తర్వాత నగరంలో ప్రసిద్ధి చెందిన ఐదురోడ్ల కూడలి ఇది. ఆర్యాపురం, సీతానగరం, కోరుకొండ, హైటెక్ బస్టాండ్, కంబాల చెరువు నుంచి వచ్చే రోడ్లు ఇక్కడ కలుస్తాయి. నగరంలోని పుష్కరఘాట్, అర్బన్ స్క్వేర్ సెంటల్, దేవీచౌక్ ప్రాంతాలు ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాల జాబితాలో ఉన్నాయి. త్వరలో కొద్దిరోజుల్లో కంబాల చెరువు జంక్షన్ అద్భుతంగా తయారుకానుంది. ఇక్కడ మొత్తం 9 విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు ఏప్రిల్ 10 నాటికి పూర్తి కానున్నాయి. ఈ జంక్షన్ అభివృద్ధితో పాటు వాటర్ ఫౌంటైన్, గ్రీనరీ, విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయనున్నారు.



చురుకుగా వాటర్ ఫౌంటైన్ నిర్మాణ పనులు

ఏప్రిల్ 10 నాటికి పనుల పూర్తి



కంబాల చెరువు జంక్షన్ పనులు ఏప్రిల్ 10 నాటికి సంపూర్ణంగా పూర్తి కానున్నాయి. ఇప్పటికే మూడు భారీ విగ్రహాలు ఏర్పాటు చేశాం. పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. రూ.1.50 కోట్లతో జంక్షన్‌ను అభివృద్ధి చేస్తున్నాం.

– పాండురంగారావు, ఎస్ఈ, నగర పాలక సంస్థ, రాజమహేంద్రవరం

సమస్యల పరిష్కారానికి కృషి

వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆదివారం ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న డ్రైన్ సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా.. స్థానిక నాయకులతో కలిసి దానిని పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న సచివాలయ కన్వీనర్ గోలి దేవకుమార్‌ను పరామర్శించారు. వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షబ్బర్ బాషా, సచివాలయ కన్వీనర్లు సాధనాల చంద్రశేఖర్ (శివ), తలారి వరప్రసాద్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, బొడ్డేటి శివాజీ, రేగుళ్ల రాజు, గూటం రాజు, బోడపాటి కుమార్, శ్రీరంగం బాలరాజు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న చందన నాగేశ్వర్

కొట్లాటలో వ్యక్తికి గాయాలు

కంబాలచెరువు: కోటిలింగాలరేవులో ఆదివారం రాత్రి జరిగిన జాతర మహోత్సవంలో కొట్లాట చోటుచేసుకుంది. ఈ సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సోమాలమ్మ జాతర జరుగుతుండగా అదే ప్రాంతానికి చెందిన కె.రమేష్.. మరో వ్యక్తి పొట్టను పదునైన ఆయుధంతో చీరాడు. గాయాలపాలైన అతడిని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అతనికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి మూడో పట్టణ పోలీసులు చేరుకుని విషయంపై ఆరా తీస్తున్నారు.

విశ్రాంత అధికారుల సంక్షేమానికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: ఏపీ పేపరుమిల్లులో ఉద్యోగ విరమణ చేసిన అధికారుల సంక్షేమానికి ఏపీ పేపరుమిల్లు విశ్రాంత ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పేపరుమిల్లు మెయిన్ గేటు ఎదురుగా ఉన్న శ్రీకృష్ణసాయి కల్యాణ మండపంలో ఆదివారం ప్రథమ జనరల్ బాడీ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీహెచ్‌వీ రామరాజు పాల్గొని మాట్లాడుతూ పేపరుమిల్లులో గతంలో ఆఫీసర్లుగా పనిచేసిన వారందరూ అసోసియేషన్‌గా ఏర్పడటం విశేషమన్నారు. టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇందులో సుమారుగా 200 మంది ఉన్నారని, వారందరి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి

త్యాగాల ఫలితమే ఐక్య ఉపాధ్యాయ సంఘం

కంబాలచెరువు: ఎందరో ఉపాధ్యాయ నేతల త్యాగాల ఫలితంగా ఐక్య ఉపాధ్యాయ సంఘం ఏర్పడిందని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. యూటీఎఫ్ ఉద్యమ నిర్మాతలు అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణ రాజు వర్ధంతిని ఆదివారం స్థానిక వీటీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా అప్పారి, సూర్యనారాయణ రాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం షేక్ బాబ్జీ మాట్లాడుతూ హక్కులను పరిరక్షించుకోవడానికి ఉపాధ్యాయులందరూ చైతన్యంతో ఉద్యమాలకు, పోరాటాలకు సంసిద్ధులుగా ఉండాలన్నారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ ఆల్ ఇండియా కార్యదర్శి పి.సతీష్, జిల్లా అధ్యక్షులు జయకర్, ప్రధాన కార్యదర్శి షరీఫ్, కోశాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

పర్యావరణాన్ని కాపాడాలి

రాజమహేంద్రవరం రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చావన్ శ్యాంరాజ్ నాయక్ అన్నారు. ఆదివారం తొర్రేడులో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవాశిబిరంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ డి.సాయిగంగాధర్ నేటి వ్యవసాయంలో యాంత్రీకరణ ప్రాముఖ్యతను రైతులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తొర్రేడు సొసైటీ అధ్యక్షులు చిట్టూరి వెంకట్రావు, సభ్యులు పాల్గొన్నారు. సోమవారం తొర్రేడు పశువైద్యశాలలో వైద్యశిబిరం నిర్వహించనున్నారు.

రిజర్వేషన్లతోనే కాపుల అభివృద్ధి

సీటీఆర్ఐ: రిజర్వేషన్లతోనే కాపుల అభివృద్ధి సాధ్యమని కాపునాడు సమావేశం అభిప్రాయ పడింది. స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం కాపునాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బోణం నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల ముందు కాపులకు రిజర్వేషన్ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటుందే తప్ప, ఈ సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించడానికి ప్రయత్నం జరగడం లేదన్నారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నరసింహమూర్తి, సర్వజన పార్టీ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంగారావు

మెరుగైన సమాజానికి కృషి

ప్రకాశం నగర్: అవినీతి, దౌర్జన్యం లేని మెరుగైన సమాజ స్థాపన కోసం తమ పార్టీ కృషి చేస్తుందని భారతీయ జవాన్ కిసాన్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు కేఎస్ నాయర్ అన్నారు. ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం స్థానిక విక్రమ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కోఆర్డినేటర్ సుదర్శన బ్రహ్మరుషి అధ్యక్షత వహించారు. నాయర్ మాట్లాడుతూ రైతు, బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం అహర్నిశలు తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గాన్ని నియమించారు. వర్కింగ్ అధ్యక్షుడిగా వరికూటి ఆంజనేయులు (ప్రకాశం జిల్లా), అధ్యక్షుడిగా చిల్లర నాగ సురేంద్రబాబు (బాపట్ల), కార్యదర్శిగా రావూరి శ్రీనివాసరావు (ప్రకాశం), ఉపాధ్యక్షుడిగా వీవీఎస్ నారాయణ (తూర్పుగోదావరి), సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ ఏడుకొండలు (ఎస్టీఆర్) నియమితులయ్యారు. కార్యక్రమంలో ఈలపాట కుసుమ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఎల్ విజేత అజ్జరపు లయన్స్

ప్రకాశం నగర్: మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఆధ్వర్యంలో జరుగుతున్న రాజమహేంద్రవరం ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) సీజన్ ఫైవ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా అజ్జరపు లయన్స్ నిలిచింది. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం ఫైనల్స్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో ఆర్‌పీఎల్ చైర్మన్ అజరపు వాసు టాస్ వేయగా ఎస్పీ 11 జట్టు టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన అజ్జరపు లయన్స్ 137 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఎస్పీ 11 జట్టు 19.2 ఓవర్లకు 71 పరుగులకు ఆలౌట్ అయ్యింది. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నక్కా శ్రీనగేష్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, బీవీఎస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎనిమిది రాష్ట్రాల నుంచి వచ్చిన 28 జట్లతో సుమారు 45 రోజులు జరిగిన ఆర్‌పీఎల్ నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా అనపర్తికి చెందిన రంజీ ప్లేయర్ కార్తీక్ రామన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రామిరెడ్డి, వెంకట రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కంచుమర్తి చంటి, మానే దొరబాబు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న రౌతు సూర్యప్రకాశరావు, షర్మిలారెడ్డి తదితరులు

డాక్టర్ ఎస్కే వలీకి ఉగాది నంది పురస్కారం

సీటీఆర్ఐ: ఉగాది నంది పురస్కారాలు పేరుతో విశేష ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు పురస్కారాలు అందించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం స్థానిక జక్కంపూడి రాజా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దృశ్య కళల అకాడమీ, కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ, శ్రీ శ్రీ కళా వేదిక సంయుక్తంగా అందించిన ఉగాది నంది పురస్కారాన్ని రాజా చేతుల మీదుగా ఓంశ్రీ ప్రొఫెషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ సర్వీసెస్ అధినేత డాక్టర్ ఎస్కే వలీ అందుకున్నారు. ఉగాది రోజు అందించిన పురస్కారాల వేదికకు అనివార్య కారణాల వల్ల రాలేకపోయిన వలీకి ఆదివారం అందించడం జరిగింది. వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను, ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజాయోనా, యూహెచ్‌ఆర్‌పీసీ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జొన్నకూటి విజయకుమార్ పాల్గొన్నారు.



వలీకి పురస్కారాన్ని అందిస్తున్న జక్కంపూడి రాజా

విద్యపై మక్కువ పెంచుకోవాలి



గ్రాడ్యుయేషన్‌డేలో పాల్గొన్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

కంబాలచెరువు: విద్యార్థులు ఉన్నత విద్యపై మక్కువ పెంచుకోవాలని, దీనికి చిన్ననాడు జరిపే గ్రాడ్యుయేషన్ డే స్ఫూర్తి నింపుతుందని రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టులో ఆదివారం తేజస్ స్కూల్ 19వ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే పేరుతో చిన్నారుల్లో చిన్ననాటి నుంచే విద్యపై ఇష్టాన్ని పెంచే దిశగా వారిని ముందుకు తీసుకెళ్తున్న తేజస్ స్కూలు నిర్వాహకులు మరింత ప్రగతి సాధించాలన్నారు. అనంతరం సంస్థ డైరెక్టర్ మహాలక్ష్మి యూఎస్ఏ యూనివర్సిటీ నుంచి ఇంగ్లిష్ విభాగంలో డాక్టర్ ఆఫ్ లిటరేచర్ పూర్తిచేసి డాక్టరేట్ స్వీకరించినందుకు ఆమెను అభినందించారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పద్మావతి, స్కూల్ కరస్పాండెంట్ కళ్యాణ్ రెడ్డి పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపునకు కొర్రీలు

- నిధులు లేక అభివృద్ధి పనులకు ఆటంకం
- ఆందోళనకు సిద్ధమవుతున్న జేగురుపాడు గ్రామస్తులు

కడియం: పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరులు పన్నులే. ముఖ్యంగా వివిధ పరిశ్రమలు ఉన్నచోట్ల ఆయా గ్రామాల అభివృద్ధిలో ఆ పరిశ్రమలు చెల్లించే పన్నులనే వినియోగిస్తుంటారు. అయితే సదరు సంస్థలు పన్ను చెల్లించడానికి కొర్రీలు వేస్తుండడంతో గ్రామ పంచాయతీ పాలకవర్గాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. కడియం మండలం జేగురుపాడు పంచాయతీకి జీవీకే సంస్థ చెల్లించే పన్ను కీలక ఆదాయ వనరు. ఆ పన్ను నిధులతోనే గ్రామంలో తాగునీరు, శానిటేషన్, విద్యుద్దీపాలు తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేస్తుంటారు. 1986 నుంచి గ్రామాభివృద్ధికి ఈ పన్నులే అత్యంత కీలకంగా ఉపయోగపడుతున్నాయి. అయితే ఇటీవల జీవీకే సంస్థ పీపీఏ గడువు ముగియడంతో 2018లో ఏపీఈపీడీసీఎల్‌కు అనుబంధ సంస్థ అయిన ఏపీ జెన్‌కోకు సంబంధించిన గోదావరి గ్యాస్ పవర్ ప్రాజెక్ట్‌కు అప్పగించారు. ఈ బదలాయింపు పూర్తయిన తరువాత గత యేడాది వరకు కూడా పన్ను చెల్లింపులు సక్రమంగానే చేసేవారు. ప్రతి ఆర్థిక సంవత్సరం డిసెంబరు నెలాఖరునాటికి పన్ను చెల్లింపులు కూడా పూర్తయ్యేవి.

అయితే 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు చెల్లించడానికి గోదావరి గ్యాస్ పవర్ ప్రాజెక్టు సంస్థ అధికారులు కొర్రీలు వేస్తున్నారని గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆరోపిస్తోంది. దీనిపై జిల్లా కలెక్టర్ కె. మాధవీలత దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సదరు సంస్థ నుంచి ఎటువంటి స్పందన కానరాలేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది గ్రామాభివృద్ధికి గోదావరి గ్యాస్ పవర్ ప్రాజెక్టు సంస్థ నిధులతో వివిధ రకాల అభివృద్ధి పనులకు ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకున్నారు. అయితే మూడు నెలలు గడుస్తున్నప్పటికీ ఆ సంస్థ నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో సంబంధిత పనులు పెండింగ్‌లో పడిపోయాయని పాలకవర్గం చెబుతోంది. ఇలా పెండింగ్‌లో పడిన పనుల్లో వేసవిలో అత్యవసరమైన తాగునీటి సంబంధిత పనులు కూడా ఉన్నాయని పాలకవర్గం వివరిస్తోంది. ఉద్దేశ పూర్వకంగా సదరు సంస్థ ఉన్నతాధికారులు నిధులను నిలుపుదల చేస్తున్నారని పాలకవర్గ భావిస్తోంది. దీంతో తమగ్రామాభివృద్ధికి విఘాతం కల్పిస్తున్న ఇటువంటి చర్యలను అడ్డుకునేందుకు పాలకవర్గం ఏకపక్షంగా తీర్మానం చేసి ఆందోళనకు సిద్ధమవుతోంది. దీనిపై రెండు మూడు రోజుల్లోనే గ్రామ సభను నిర్వహించి, అన్ని రాజకీయ పక్షాలతో సమావేశమై నిరసనల కార్యాచరణకు సిద్ధమవుతోంది.

ఇదిలా ఉండగా పన్ను చెల్లింపుల పెండింగ్ విషయంపై జేగురుపాడు గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ కడియం మండల పార్టీ అధ్యక్షులు యాదల సతీష్‌చంద్రస్టాలిన్‌ను సంప్రదించగా సదరు సంస్థ నుంచి ఇంకా పన్ను వసూలు కాని మాట వాస్తవమేనన్నారు. ప్రతి యేటా డిసెంబరు నెలాఖరు నాటికి సదరు సంస్థకు సంబంధించిన పన్ను చెల్లింపులు పూర్తయ్యేవన్నారు. ఈ యేడాది మాత్రం మార్చి నెలాఖరు వస్తున్నా పన్ను చెల్లించలేదన్నారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళామని, అయితే వారి నుంచి తగిన స్పందన లేదన్నారు. గ్రామాభివృద్ధికి ఈ సంస్థ చెల్లించే పన్నులు కూడా కీలకంగా ఉపయోగపడతాయన్నారు. వెనుకబడిన సామాజికవర్గాల ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లో పలు కీలక పనులకు ఈ నిధులు ఖర్చు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అయితే ఆ నిధులు రాకపోవడంతో ఆయా ప్రాంతాల్లో పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. దీంతో పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు, అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలన్న డిమాండ్ ఉందని స్టాలిన్ వివరించారు. దీనిపై త్వరలోనే తగిన కార్యాచరణ వెల్లడిస్తానని, అలాగే జిల్లా స్థాయి అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లనున్నట్లు స్టాలిన్ వివరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రకాశం నగర్: టోల్‌గేట్‌లలో పనిచేస్తున్న ఇన్‌చార్జులు, సూపర్ వైజర్లు, టీసీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఏపీ టోల్‌గేట్ యూనియన్ నగర శాఖ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ చాలా టోల్‌గేట్‌లలో 2015 నుంచి ఇప్పటి వరకూ సుదీర్ఘంగా చాలామంది పనిచేస్తున్నారన్నారు. కానీ ఆయా కాంట్రాక్టర్లు కనీస వేతన చట్టాన్ని కూడా అమలు చేయడం లేదన్నారు. అనంతరం ఏపీ టోల్ గేట్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు.

ఎంపీఎల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



విజేతను అభినందిస్తున్న డ్రగ్స్ ఏడీ నాగమణి

కంబాలచెరువు: ది రాజమండ్రి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కాలనీలో ఆదివారం మందుల దుకాణాల హోల్‌సేల్, రిటైల్ ఉద్యోగుల ఎంపీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను జిల్లా ఔషధ నియంత్రణశాఖ ఏడీ నాగమణి ప్రారంభించారు. ముందుగా ఆమె టాస్ వేసి ఆటను ప్రారంభించారు. గెలుపొందిన జట్టుకు రూ.10 వేల బహుమతి అందించి ప్రోత్సహించారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రకాశం నగర్: కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధపడాలని పలువురు వ్యక్తులు పిలుపునిచ్చారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 7వ మహాసభ స్థానిక వీరభద్ర రజక కల్యాణ మండపం వద్ద ఆదివారం జరిగింది. ముందుగా కార్మికులు కోటిపల్లి బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, కంభంవారి సత్రం, గోదారి గట్టున కరెంట్ ఆఫీస్, శివవీరభద్ర రజక కల్యాణ మండపం వరకు ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీమన్నారాయణ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.